క్లుప్తంగా

డిపాజిట్‌లపై అత్యధిక వడ్డీ


బ్యాంక్ మేనేజర్

దెందులూరు: ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తుందని ఈ అవకాశాన్ని వినియోగదారుల సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు ఏపీ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ నాగార్జున అన్నారు. గురువారం బ్యాంక్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జనరల్ సిటిజన్లకు 7.35 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.85 శాతం సూపర్ సీనియర్లకు 8.10 శాతం సంవత్సరం నుంచి రెండు సంవత్సరాల లోపు డిపాజిట్లపై వడ్డీ రాయితీ ఇస్తుందని ఇంత వడ్డీ ఏ ప్రభుత్వ రంగ బ్యాంకు ఇవ్వటం లేదని మేనేజర్ నాగార్జున తెలిపారు.

శ్రావణమాస పూజలకు మహిళలు సిద్ధం

ఉంగుటూరు: శ్రావణ శుక్రవారం లక్ష్మీదేవి వ్రతాలు నిర్వహించుకునే పనిలో మహిళలు నిమగ్నమయ్యారు. ఇళ్లు శుభ్రం చేసుకుని, మామిడి తోరణాలు కట్టుకుని, బంగారు రూపులు కొనుగోలు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా బట్టలు, బంగారం, కిరాణా దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

నిడమర్రు ఎంఈవో-2గా యర్రంశెట్టి


వై.శేషగిరిరావు

నిడమర్రు: నిడమర్రు ఎంఈవో-2గా చానమిల్లి గ్రేడ్-2 హెచ్ఎం యర్రంశెట్టి శేషగిరిరావును నియమిస్తూ జిల్లా విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రెగ్యులర్ ఎంఈవో-2 విధులు నిర్వహించిన కె.రాంబాబు పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో భీమడోలు ఎంఈవో-2ను భాస్కర్‌కుమార్‌కు నిడమర్రు ఎంఈవో-2 అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజాగా మండలంలోని సీనియర్ గ్రేడ్-2 హెచ్ఎంగా ఉన్న శేషగిరిరావుకు నిడమర్రు ఎంఈవో-2 బాధ్యతలు అప్పగించారు. ఈయనకు గతంలో ఇదే మండలం ఎంఈవోగా నాలుగు నెలలు విధుల నిర్వహించిన అనుభం ఉంది.

కాలు కోల్పోయిన బాధితుడికి ఊరట


అందుగుల భూషణానికి సంకలో కర్రలు అందజేస్తున్న మానవత మండల అధ్యక్షుడు సత్యనారాయణ

సాక్షి స్పందన

ఉంగుటూరు: బొమ్మిడి గ్రామానికి చెందిన అందుగుల భూషణం అనే వ్యక్తికి చేప ముల్లు గుచ్చుకోవడంతో కాలు తీసివేశారని సాక్షిలో ఇటీవల వార్త రాశారు. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లా విభిన్న ప్రతిభావంతుల సహాయ డైరెక్టర్ రామ్‌కుమార్ స్పందించి తక్షణ సహాయం కింద చంకలో క్రరలు ఇచ్చారు. కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షుడు కోనే వీర వెంకట సత్యనారాయణ, మండల దివ్యాంగ సంఘం నాయకుడు ఉద్దండ అప్పారావు చేతుల మీదుగా ఉపకరణాలు భూషణం అందుకున్నారు.

పాఠశాల విద్యార్థి సంఘం ఎన్నికలు


ఎన్నికైన ఎస్‌పీఎల్, తరగతి లీడర్లతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

గణపవరం: నిడమర్రు ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్ పీపుల్స్ లీడర్ (ఎస్‌పీఎల్), తరగతి లీడర్ల ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల ప్రత్యేక అధికారిగా హెచ్ఎం నరేష్ బాబు వ్యవహరించారు. ఆయా తరగతి ఉపాధ్యాయులు ఇచ్చిన గుర్తింపు కార్డుల ఆధారంగా విద్యార్థులు ఓటు వేశారు. ఈ ఎన్నికలలో 294 మంది విద్యార్థులు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఎస్‌పీఎల్‌గా నల్ల వెంకటేశ్వర్లు ఎంపికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన శానం శ్రీనివాస్ ప్రకటించారు. దీంతో పాటు తరగతి లీడర్లను ప్రకటించారు. విజేతలచే హెచ్ఎం నరేష్‌బాబు ప్రమాణ స్వీకారం చేయించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలి

గణపవరం: రోజురోజుకు ఇబ్బందికరంగా మారుతున్న వాతావరణం మానవాళి మనుగడకే ముప్పుగా పరిణమిస్తుందని, దీనిని అధిగమించడానికి ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని ఒక బాధ్యతగా తీసుకోవాలని ప్రముఖ పర్యావరణ వేత్త, వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు అల్లూరి గంగరాజు, గణపవరం బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం వీరవేణి అన్నారు. సేవాసమితి ఆధ్వర్యంలో గణపవరం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

ఇన్‌చార్జిలతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం

- ఏళ్ల తరబడి నిడమర్రు ఎంఈవో పోస్ట్ ఖాళీ
- నాలుగు మండలాల్లో రెగ్యులర్ ఎఈవో-1లు ఇద్దరే
- ఉన్న ఎంఈవో-2లు అదనపు బాధ్యతలే
- పాఠశాలల్లో బోధనపై కుంటుపడుతున్న పర్యవేక్షణ


నిడమర్రు మండల విద్యాశాఖ కార్యాలయం


గణపవరం ఎంఈవో-1గా అదనపు బాధ్యతల్లో ఎస్. రాజేష్

నిడమర్రు: ఉంగుటూరు నియోజకవర్గంలో విద్యా వ్యవస్థలో ఏళ్ల తరబడి ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. భీమడోలు, ఉంగుటూరు మండలాల్లో రెగ్యులర్ ఎంఈవో-1, ఎంఈవో-2లు ఉన్నా వారికి మరో మండలాల్లో ఎంఈవోలుగా, డివిజన్లలో డీవైఈవోలుగా అదనపు బాధ్యతల భారంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడుతోందని ఉపాధ్యాయ సంఘాల నేతలే చెబుతున్నారు. దీంతో విద్యా బోధన కుంటుపడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఈ విద్యా సంత్సరం నుంచి ఒకటి నుంచి పదో తరగతి వరకూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో మాత్రమే బోధన, పరీక్షలు ఉంటాయని ప్రభుత్వం చెబుతుంది. అందుకు అనుగుణంగా విద్యా బోధన జరుగుతుందో.. లేదో పర్యవేక్షించే అధికారులు నాలుగు మండలాల్లో కరువయ్యారని తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు, ఇన్‌చార్జి ఎంఈవో-1, ఎంఈవో-2లతో ఏళ్ల తరబడి పర్యవేక్షణ కొనసాగితే భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

16 ఏళ్లుగా నిడమర్రుకు ఇన్‌చార్జిలే..

నిడమర్రు మండలానికి రెగ్యులర్ మండల విద్యాశాఖ అధికారిగా ఉన్న రామకృష్ణంరాజు 2009లో పదవీ విరమణ చేశారు. నాటి నుంచి నేటి వరకూ ఆ పోస్ట్‌లో ఇన్‌చార్జిల పాలనలోనే కొనసాగింది. కొంతకాలం మండలంలోని సీనియర్ జెడ్పీ స్కూల్ ప్రధానోపాధ్యాయులైన ఎంఎస్ శాస్త్రి, కె.రాంబాబు, వై.శేషగిరి తదితరులకు అదనపు బాధ్యతలను, మరి కొంతకాలం కన్వర్షన్‌పై వచ్చిన హైస్కూల్ హెచ్ఎంలైన కె.రాంబాబు, వంగపండు నర్సింహమూర్తిలు ఎంఈవోలు విధులు నిర్వహించారు. తరువాత గణపవరం ఎంఈవోగా ఉన్న పుచ్చల శేషును నిడమర్రు ఎంఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించి కొనసాగించారు.

పర్యవేక్షణ భర్తీకి ఎంఈవో-2 పోస్టులు

గత ప్రభుత్వ హయాంలో కామన్ సర్వీస్ సమస్యల కారణంగా ఎంఈవో పోస్టుల భర్తీకి సమస్యలు రావడంతో పాఠశాలల్లో బోధన పర్యవేక్షణ కుంటు పడరాదని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఈవో-2 పోస్టులకు శ్రీకారం చుట్టి పర్యవేక్షణను భర్తీ చేసేలా చర్యలు తీసుకుంది. ఎంఈవో-1 పరిపాలన అంశాలను, ఎంఈవో-2 విద్యా సంబంధ అంశాల బాధ్యతలు అప్పగించింది. ఎంఈవో-2 పోస్టుల్లో గ్రేడ్-2 హెచ్ఎంల సీనియారిటీ ఆధారంగా నాడు అన్ని పోస్టులను భర్తీ చేశారు. అయితే ఎంఈవో-1, ఎంఈవో-2లుగా ఉన్న వారు పదవీ విరమణ చేయడంతో ఆ పోస్టుల్లోనూ నేటి కూటమి ప్రభుత్వం ఇన్‌చార్జిలతోనే కొనసాగిస్తోంది.

రవీంద్ర భారతికి రెండు డివిజన్ల బాధ్యతలు

ఉంగుటూరు రెగ్యులర్ ఎంఈవో-1గా ఉన్న ఎస్.రవీంద్రభారతికి ఏలూరు, తాడేపల్లిగూడెం, నూజివీడు డీవైఈవో బాధ్యతలను అదనంగా అప్పగించారు. ఎఈంవో 2గా శ్రీనివాస్ పదవీ విరమణ అనంతరం ద్వారకాతిరుమల ఎంఈవో-2గా ఉన్న పి.వెంకట్రావును ఉంగుటూరు ఎంఈవో-2గా అదనపు బాధ్యతలను అప్పగించారు. అలాగే భీమడోలు మండలం రెగ్యులర్ ఎంఈవో-1, ఎంఈవో-2లుగా ఉన్న శ్రీనివాస్‌కు, భాస్కర్‌లకు నిడమర్రు ఎంఈవో-1, ఎంఈవో-2లుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గణపవరం మండలం ఎఈవో-1గా ఉన్న పుచ్చల శేషు పదవీ విరమణ చెయ్యడంతో ఆ స్థానంలో పెంటపాడు పోర్ట్ బేసిక్ స్కూల్ హెచ్ఎం ఎస్. రాజేష్‌ను ఎంఈవో-1గా అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజాగా బావాయిపాలెం జెడ్పీ స్కూల్ గ్రేడ్-2 హెచ్ఎం వై. శేషగిరిరావును నిడమర్రు ఎంఈవో-2గా, గొల్లగుడెం జెడ్పీస్కూల్ గ్రేడ్-2 హెచ్‌గా ఉన్న పి. సాయిబాబును ఉంగుటూరు ఎంఈవో-2గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఏలూరు జిల్లా విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో విద్యాశాఖలో ఏళ్ల తరబడి ఇన్‌చార్జిల ఏలుబడి తప్పడం లేదు.

ఇన్‌చార్జిలతో ఆశించిన ఫలితాలు రావు



విద్యాశాఖలో జరుగుతున్న సంస్కరణలు సక్రమంగా అమలవ్వాలంటే పర్యవేక్షణ తప్పనిసరి. ఏళ్ల తరబడి ఎంఈవో పోస్టులను భర్తీ చేయకుండా ఇన్‌చార్జిలతో కాలక్షేపం చేస్తే విద్యాశాఖలో ఆశించిన ఫలితాలు రావు. అదనపు బాధ్యతలతో ఎంఈవో-1, 2లు అటు, సొంత మండలాలకు, ఇటు అదనపు బాధ్యతల మండలాలకు న్యాయం చేయలేక పోతున్నారు.

–డి.జోగినాయుడు, మండల ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్, ఉంగుటూరు

ఎంఈవో పోస్టుల బదిలీలు నిర్వహించాలి



ఎంఈవో-1, ఎంఈవో-2 పోస్టులకు బదిలీలు నిర్వహించాలి. మిగిలిన పోస్టులకు పదోన్నతులపై భర్తీ చేస్తే గానీ ఇన్‌చార్జిల పాలనకు స్వస్తి పలకలేం. ఇలా మండలాల్లో సీనియర్ గ్రేడ్-2 హెచ్ఎంలకు ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు అప్పగించడం వలన ప్రస్తుతం హెచ్ఎంగా ఉన్న పాఠశాల ప్రగతి కుంటుపడే అవకాశం ఉంది. దీనిపై ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు సరైన నిర్ణయం తీసుకుని బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి.

–పుప్పాల ప్రకాశరావు, రాష్ట్ర కార్యదర్శి, ఎస్టీయూ

కనకదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ


గాజులతో అలంకరించిన కనకదుర్గమ్మ

దెందులూరు: పోతునూరులోని శ్రీకనకదుర్గమ్మకు గురువారం ఆలయ కమిటీ, భక్తుల సహకారంతో శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం నిర్వహించనున్న వరలక్ష్మీ వ్రతానికి 12 వేల గాజులతో విశిష్టాలంకరణ చేశారు. అనంతరం పోతునూరు గ్రామం భక్తులు ఆలయానికి వచ్చి పూజలు నిర్వహించారు.

నేడు శ్రీఅచ్చమ్మ పేరంటాలుకు సారె

దెందులూరు: గాలాయిగూడెంలోని శ్రీఅచ్చమ్మ పేరంటాలు తల్లి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి శుక్రవారం ఉదయం వరలక్ష్మి వ్రతం అనంతరం చీర, సారె సమర్పించనున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కళింగ రామాలయంలో పూజలు


హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

ఉంగుటూరు: కైకరం కళింగ రామాలయం వద్ద ఆలయ వార్షికోత్సవ సందర్భంగా గురువారం విశేష పూజలు నిర్వహించారు. లక్ష్మీ గణపతి హోమం, సుదర్శన హోమం, ఆయుష్ సూక్త హోమాలు నిర్వహించారు. ఈ పవిత్ర హోమాలను నిడదవోలుకు చెందిన శుక్ల యజుర్వేద స్మార్త పండిట్ పొన్న రాజశేఖర్ గురుతత్వంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కూనా అప్పారావు ఆధ్వర్యంలో జరిపిన కార్యక్రమంలో పది జంటలు పీటలు మీద కూర్చుని ఈ క్రతవులు నిర్వహించారు. పూజాద్రవ్యాలను ఆలయ కమిటి వారుసమకూర్చారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం


భీమడోలు: గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారిణి, ఎంపీహెచ్ఈవో


గణపవరం: డీవార్మింగ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

భీమడోలు: బాలబాలికల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు దివ్య ఔషధంగా పని చేస్తాయని పూళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.అరుణజ్యోతి అన్నారు. పూళ్ల పీహెచ్‌సీలో ఈ నెల 12వ తేదీన మంగళవారం నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణపై గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఎంపీహెచ్ఈవో వైవీ లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైద్యాధికారిణి పి.అరుణజ్యోతి మాట్లాడుతూ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది విజయవంతం చేయాలని కోరారు. ఎంపీహెచ్ఈవో వైవీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను అందిస్తామన్నారు. తొలుత నులి పురుగుల నివారణ కార్యక్రమం గోడ పత్రికను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నూర్జహాన్, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలు

గణపవరం: నులిపురుగులతో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని, ముఖ్యంగా బాలబాలికలు నులిపురుగుల కారణంగా రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలు వస్తాయని ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, గణపవరం, పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారులు ఓంకార్‌నాథ్, శ్రీదివ్య అన్నారు. ఈ నెల 12వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల కార్యాలయంలో మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ గణపవరం పీహెచ్‌సీ పరిధిలో 6242 మంది పిల్లలు, పిప్పర పీహెచ్‌సీ పరిధిలో 5650 మంది పిల్లలు ఉన్నారని వీరందరికీ ఆల్‌బెండాజోల్ మాత్రలు వేయాల్సి ఉందన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో గొర్రెల బాలయ్య, పిహెచ్‌సి సిహెచ్‌వో జాలాదివిల్సన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చేనేత వారసత్వ సంపద


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నిర్మలకుమారి

గణపవరం: అతిపురాతన కాలం నుంచి ప్రాచుర్యంలో ఉన్న చేనేత కళ మన వారసత్వ సంపద అని, చేనేత గురించి నేటి యువత తెలుసుకోవలసిన అవశ్యకత ఉందని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. గురువారం డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్, ఎకోక్లబ్‌ల ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి చేనేత ప్రాముఖ్యత, దానిపై ఆధార పడిన కుటుంబాలు, వారు పడుతున్న కష్టాలు, ప్రభుత్వాలు చేనేత అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ స్వరూపరాణి మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం తరువాత అంతటి ప్రాముఖ్యత, పరిధి కలిగిన రంగం చేనేత రంగమేనన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రామ్ అధికారి వెంకటరమణ, షేక్ మోయిన్, కేవీ గణేష్, ఎకోక్లబ్ కో–ఆర్డినేటర్ పర్వీన్ షేక్, జి.శారదాదేవి, పి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గడువు ముగిసినా విద్యుత్ బిల్లులు ఇవ్వట్లేదు


ఇంకా రీడింగ్ తీయని విద్యుత్ మీటర్

భీమడోలు: ఓ పక్క అధిక విద్యుత్ బిల్లులతో వినియోగదారుల గుండెలు గుబేలుమంటుండగా, మరో పక్క గడువు ముగిసినా విద్యుత్ బిల్లులు అందక వారంతా ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ బిల్లింగ్ కాంట్రాక్ట్ సిబ్బంది నిర్లక్ష్యం, విద్యుత్ శాఖ పట్టించుకోకపోవడంతో భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని ఎం.నాగులపల్లి ఏరియాలో ద్వారకానగర్, గన్ని కాలనీల్లో నేటికీ విద్యుత్ బిల్లులు అందక వారంతా ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 5వ తేదీలోగా విద్యుత్ బిల్లులను వినియోగదారులకు ఇవ్వాల్సి ఉండగా గడువు తేదీ ముగిసి రెండు రోజులు గడుస్తున్నా నేటికీ విద్యుత్ బిల్లులు అందించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విద్యుత్ టారిఫ్‌లు, లోడ్ రిలీఫ్, ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారుల నడ్డి విరుస్తుంది. దీనితో ఒక యూనిట్ పెరిగినా టారిఫ్ పెరిగి, విద్యుత్ బిల్లులు తడిసి మోపుడతున్నాయని విద్యుత్ వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఎం.నాగులపల్లి పంచాయతీ పరిధిలో 2500 విద్యుత్ కనెక్షన్లు ఉండగా వాటిలో ద్వారకానగర్, గన్ని కాలనీల్లో 1500 కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 60 శాతం వరకు విద్యుత్ బిల్లులు అందించారు. కొన్ని చోట్ల రెండు, మూడు మీటర్లు ఉన్న చోట ఒక్క మీటర్ రీడింగ్ బిల్లులు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై భీమడోలు ఏడీఈ మల్లేశ్వరరావును వివరణ కోరగా ఈ సమస్యను పరిష్కరిస్తానన్నారు. బిల్లులు అందించేలా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు రక్షణ కవచం


గణపవరం: కాశిపాడులో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రదర్శన


దెందులూరు: తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

గణపవరం: తల్లిపాలు బిడ్డకు జీవితాంతం రక్షణ కవచంలా పనిచేసి అనేక రోగాల బారి నుంచి కాపాడుతాయని ప్రతి తల్లీ బిడ్డకు పాలు ఇవ్వాలని జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని కాశిపాడులో పిప్పర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గ్రామంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పీఎంపీ సభ్యులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోతునూరులో తల్లిపాల వారోత్సవాలు

దెందులూరు: బిడ్డలకు తల్లిపాలు శ్రేయస్కరమని గర్భిణులు, బాలింతలు తల్లిపాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. పోతునూరు 148 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లులకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. తల్లిపాల విశిష్టత, సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం, వ్యాయామం ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ, వైద్య శాఖ సిబ్బంది, బాలింతలు పాల్గొన్నారు.

సదరం క్యాంపు నిర్వహణ

ఉంగుటూరు: కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రత్యేక సదరం క్యాంపు గురువారం నిర్వహించారు. క్యాంపులో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మరాజు శారీరక వైకల్యం (లోకో మోటార్) పింఛన్ల వెరిఫికేషన్ పక్రియకు సంబంధించి వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి సదరం సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మానస, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కారుమూరి సునీల్ నియామకంపై హర్షం

దెందులూరు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్‌ను ఇటీవల నియమించారు. సునీల్ కుమార్ నియామకంపై వైఎస్సార్ సీపీ మహిళా విభాగం దెందులూరు నియోజకవర్గం అధ్యక్షురాలు అంగడాల సీతారావమ్మ, జిల్లా కార్యదర్శి కొలుసు గణపతిరావు, దెందులూరు నియోజకవర్గం పార్టీ పోలింగ్ బూత్ కన్వీనర్ తలారి రామకృష్ణ, దెందులూరు మండల యువజన విభాగం అధ్యక్షుడు గొరిపర్తి శ్రీనివాస్ యాదవ్, ఎంపీటీసీ అంగడాల వెంకటేశ్వరరావు, పోతునూరు మాజీ ఎంపీటీసీ బత్రాజ్ సత్యనారాయణ, కొవ్వలి ఎంపీటీసీ గొరిపర్తి రంగారావు, రామారావుగూడెం మాజీ సర్పంచ్ పేరం ప్రసాద్ హర్ష వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సునీల్ కుమార్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని పార్టీ అభివృద్ధి బలోపేతానికి నాయకులు కార్యకర్తలు మధ్య సమన్వయానికి విశిష్ట సేవలు అందించాలని నాయకులు కోరారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

భీమడోలు: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందగలమని ఉంగుటూరు ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ అన్నారు. ఉంగుటూరు ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ ఆధ్వర్యంలో స్వచ్ఛా సర్వేక్షణ్ సర్వే బృందం సభ్యులు గుండుగొలను ఆదర్శ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. విద్యార్థులు మరుగుదొడ్ల వినియోగం, మంచినీటి ఆర్వో ప్లాంట్ వాడకం తదితర అంశాలను పరిశీలించారు. హెచ్ఎం పాశం పాండురంగారావు, కార్యదర్శి రత్నాకర్, బృందం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నానో యూరియాను వినియోగించాలి

పెదపాడు: రైతులు యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను వినియోగించుకోవాలని ఏలూరు వ్యవసాయశాఖ ఏడీఏ ఇ.అనీల్‌కుమారి రైతులను కోరారు. మండలంలోని పెదపాడు గ్రామంలో నానో యూరియా పిచికారీ, క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా రైతులు పలు సూచనలు చేశారు. రైతులు వరినాట్లు వేసిన తరువాత 40–45 రోజులకు అనంతరం పూత దశకు వచ్చే ముందు రైతులు యూరియాను వినియోగించాలని తెలిపారు. నానో యూరియాను లీటరు నీటికి 2.5 మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయ అధికారి షేక్ ఇమామి ఖాసిమ్ మాట్లాడుతూ ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై డ్రోన్‌లు అందిస్తోందని చెప్పారు. నీటి సంఘం అధ్యక్షుడు బొప్పిడి కాశీబాబు, రైతులు పాల్గొన్నారు..

విద్యార్థులకు యూనిఫాం అందజేత

గణపవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు దాతల సహకారం అభినందనీయమని, దాతల ఔదార్యాన్ని వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈవో గొర్రెల బాలయ్య అన్నారు. గణపవరం మండలం ముప్పర్తిపాడు యూపీ పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత ఆనందరావు రూ.30 వేల వ్యయంతో ఏకరూప దుస్తులు అందచేశారు. సర్పంచ్ కర్రి రాధాలక్ష్మి, కర్రి శ్రీనివాసరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ జానకి నాగ వెంకట రెడ్డి, ఉప సర్పంచ్ విశ్వేశ్వరరావు, విద్యా దాత బదరీనారాయణ పాల్గొన్నారు.

చెట్ల దొంగలను కఠినంగా శిక్షించాలి


దొంగలు నరికి వేసిన శ్రీగంధం, ఎర్రచందనం చెట్లను చూపుతున్న రైతులు

పెదవేగి: రైతులు ఎంతో కష్టపడి 25 నుంచి 30 ఏళ్లుగా పెంచిన శ్రీగంధం, ఎర్రచందనం చెట్లను దొంగలు నరికే ఎత్తుకు పోవడం వలన రైతులు నష్టపోతున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. గురువారం పెదవేగి మండలం రాయన్నపాలెంలో గుది బండి రమేష్ రెడ్డికి చెందిన కొబ్బరి తోటలోని దొంగలు నరికి వేసిన శ్రీ గంధం చెట్లను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు, రైతులు పరిశీలించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని విజయరాయి, రాయన్నపాలెం, కొండలరావుపాలెం, బాపిరాజుగూడెం, తదితర గ్రామాల్లో కొబ్బరి తోటల్లో శ్రీ గంధం, ఎర్రచందనం, టేకు చెట్లను అర్ధరాత్రి దొంగలు తోటల్లో పడి చెట్లను నరికి వేసి దొంగతనంగా ఎత్తుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు తగిన నిఘా ఏర్పాటు చేసి దొంగతనాలు అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో బాధిత గుదిబండి రమేష్ రెడ్డి తో పాటు తలకొండ జమలయ్య, మున్నంగి సుబ్బారెడ్డి, గుదిబండి వీరారెడ్డి, ముక్కామల సదా వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.